వాతావరణ మార్పులతో ఆక్వా రైతులు విలవిల

- ఓ రోజు ఎండ, మరో రోజు వాన అన్నట్టుగా వాతావరణం
- చేపల చెరువుల వద్దే పడిగాపులు కాస్తున్న ఆక్వా రైతులు
- భారీ పెట్టుబడులు పెట్టామని ఆందోళన


గొల్లవానితిప్పలో చేపలను పడుతున్న దృశ్యం


దొంగపిండిలో ఆయిల్ ఇంజిన్ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం ప్రాంతానికి ఆక్వా హబ్‌గా పేరుంది. ఈ ప్రాంతంలో చాలా వరకూ ఆక్వా చెరువులు ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో వాతావరణ మార్పులతో ఆక్వా రైతులు బెంబేలెత్తుతున్నారు. చెరువుల్లో చేపను రక్షించేందుకు ఇంజిన్ బోట్లు, ఏరియేటర్లు త్రిప్పుతూ మరికొన్ని చోట్ల ఆక్సిజన్ టాబ్లెట్లు వినియోగిస్తున్నారు. చేపలను రక్షించుకునేందుకు రైతులు రాత్రులు, పగలు తారతమ్యం లేకుండా చెరువుల వద్దే పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో భీమవరం, ఉండి, నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో సుమారు లక్షా 30 వేల ఎకరాలలో ముఖ్యంగా శీలావతి, కట్ల, ఫంగస్, రూప్‌చంద్, తిలాఫీ, గడ్డిచేప తదితర సప్పనీటి చేపలను పెంచుతున్నారు. చేపల పెంపకంలో నష్టాలు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు వాటిని పెంచేందుకు మొగ్గు చూపారు. రోజుకు సుమారు 1000 టన్నులకుపైగా చేపలు కలకత్తా, బెంగాల్, మహారాష్ట్ర, ఒడిస్సా తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యం జిల్లాకు చేరుకుంటుంది.

వాతావరణ మార్పులతో ఇబ్బంది

గతేడాది కంటే ఈ ఏడాది ప్రారంభంలోనే ఎండలు ఎక్కువగా ఉండటంతో చేపలు చెరువుల్లో నీరు ఇంకిపోయి ఉప్పుశాతం పెరిగిపోయిందని రైతులు చెబుతున్నారు. గత మూడు వారాలుగా వడగాల్పులు, వర్షాలు పడటంతో వాతావరణంలో మార్పులు వల్ల ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు ఏర్పడటంతో చేపలు ఉపరితలంపై అసహనంగా ఈదుతున్నాయని వాపోతున్నారు. దీంతో వాటికి తాటాకు తెగులు, మొప్ప తెగులు, పేను పట్టడం వంటి వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో సాధారణంగా ఉప్పుశాతం నాలుగు పైగా ఉంటే చేపలు ఒక్కొక్కసారి హఠాత్తుగా మృత్యువాత పడటమే కాకుండా ఎదుగుదల మందగిస్తుందని రైతులు చెబుతున్నారు.

వేసవి చేపకు గడ్డు కాలం

ఫిబ్రవరి నుంచి పంట కాలువల ద్వారా వచ్చే సాగునీరు వంతుల వారీ విధానంతో చేపలు చెరువులకు నీళ్లు పెట్టడానికి ఆస్కారం లేకపోవడంతో జూలై నెల వరకు వేసవి తాపానికి తట్టుకుని చెరువులో చేపలు బతికితేనే రైతుకు పెట్టుబడులు వస్తాయని లేకుంటే నష్టాలే మిగులుతాయని రైతులు చెబుతున్నారు.

మందగించిన చేప ఎదుగుదల

ఇటీవల కొన్ని రోజులు ఎండలు, కొన్ని రోజులు వానలు కారణంగా ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. అందువల్ల ఉదయాన్నే చేపలు నీటి ఉపరితలంపై ఈదుతున్నాయని ఆక్వా రైతులు చెబుతున్నారు. దీంతో చేపకు మేతగా పెట్టే డీఓపీ తవుడు సైతం తినడం లేదని వాపోతున్నారు. దీంతో చేపలకు తాటాకు తెగులు, మొప్ప తెగులు, పేను పట్టడం, వ్యాధులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

భారీ పెట్టుబడులు

ఒక ఎకరం చేపల సాగు చేసేందుకు సుమారు రూ.2 లక్షలు వరకు ఖర్చువుతుందని రైతులు చెబుతున్నారు. చేపల సాగు చేయాలంటే 10 ఎకరాలు పైగా చేపలు చెరువు ఉండాలని వెల్లడిస్తున్నారు. చేపలకు మేతలుగా డీఓపీ తవుడు, చెక్క, పత్తిపిండి, పిల్లేట్స్ వేస్తుంటారు. చేపకు పెట్టే మేతను బట్టీ 6 నుంచి 9 నెలల్లో కేజీ చేప తయారవుతుందని చెబుతున్నారు. చేప ఎదుగుదల మందగిస్తే చివరకు అప్పులు మిగులుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొదట్లో ఎండలు ఎక్కువగా ఉన్నాయి



నేను రెండు ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నాను. అయితే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో చేపలు మృత్యువాత పడటంతో పట్టుబడికి రాకముందే పట్టే శాను. ఈ ఏడాది నష్టాలు ఎదురయ్యాయి.

– వాటాల విజయకృష్ణ, ఆక్వా రైతు, నాగేంద్రపురం

నీటిని పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది



వాతావరణంలో మార్పులు కారణంగా ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయించుకుని వాటికి అనుగుణంగా మందులు వినియోగించాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడులు ఎక్కువతున్నాయి. ప్రతి రోజు చెరువు వద్దే ఉండి పరిశీలించాల్సి వస్తుంది.

–టి.సోంబాబు, ఆక్వా రైతు, నాగేంద్రపురం

ముగిసిన సాయిబాబా పవిత్రోత్సవాలు


ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని సాయిబాబా పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు ఉత్సవాల్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆఖరి రోజు సాయి బాబా ఆలయంలోని 100 అడుగుల సాయి కోటీశ్వర్ మహాస్థూపంలో ఐదు కోట్ల సాయినామ లిఖిత పుస్తకాల్ని నిక్షిప్తం చేశారు. సాయిబాబాకు పుష్పాభిషేకం చేశారు. అనంతరం సాయి గురువుల ఆధ్వర్యంలో సత్సంగ సభలు నిర్వహించారు.

శ్రీనివాస్, ఉమాబాల విజయం కోరుతూ చినవెంకన్నకు పూజలు

ద్వారకాతిరుమల/భీమవరం (ప్రకాశం చౌక్): వైఎస్సార్ సీపీ భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల గెలుపొంది, జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుతూ భీమవరం నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ద్వారకాతిరుమల చినవెంకన్నకు శనివారం పూజలు చేశారు. తొలుత భీమవరంలోని శ్రీ మావుళ్లమ్మవారి ఆలయంలో ఉమాబాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి కార్లతో ర్యాలీగా శ్రీవారి క్షేత్రానికి చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భీమవరం జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్న వైఎస్సార్ సీపీకి, దైవానుగ్రహం తోడవ్వాలని, తామంతా యాత్రగా క్షేత్రానికి వచ్చి, శ్రీవారిని దర్శించుకున్నట్టు చెప్పారు. దాదాపు 100 మంది నాయకులు, కార్యకర్తలు యాత్రగా వచ్చామన్నారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ విజయం సాధించి, మరోసారి ప్రభంజనాన్ని సృష్టిస్తారని ఆయన చెప్పారు. గ్రంధి శ్రీనివాస్, ఉమాబాల ఇద్దరూ విజయాన్ని సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కలిదిండి కృష్ణంరాజు, కోట్టి కుటుంబరావు, ఆరేటి వీరా సోమనాయుడు (పెద్దబ్బులు), నామన మహేష్, కోళ్ల బాలకృష్ణ, కోమటి రాంబాబు, కొప్పర్తి సత్యనారాయణ, జడ్డు నరసింహారావు, తిరుమణి ధనుంజయ్ తదితరులున్నారు.


శ్రీవారి దర్శనానంతరం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు

ముగిసిన అతిరాత్ర మహాయాగం


యాగం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): డీఎన్నార్ కళాశాల, గన్నాబత్తుల వారి క్రీడా మైదానంలో శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్(నెలమూరు) వారి ఆధ్వర్యంలో గత 11 రోజులుగా జరుగుతున్న అతిరాత్ర మహాయాగం శనివారం. ముగిసింది. సుమారు పదిహేను వేల మంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆరు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ముగింపు వేడుకల్లో మహాపూర్ణాహుతి, పుత్ర కామిష్టి యాగం వైభవంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 96 మంది మహా రుత్వికులను, 42 మంది వేదపండితులను ఘనంగా సత్కరించారు. యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ 11 రోజులపాటు యజ్ఞం, యాగం నిర్వహించామన్నారు. ముందుగా గూడూరి ఉమాబాల, పీవీఎల్ నరసింహరాజు, ఉద్దరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, గన్నాబత్తుల శ్రీనివాస్, గజల్ శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ముగింపు వేడుకల ప్రారంభించారు. అనంతరం యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మను ఘనంగా సత్కరించారు.

కపర్ది ఆశయ సాధనకు కృషి చేయాలి


కపర్ది చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సమ సమాజ స్థాపన కోసం తన జీవితాంతం కృషిచేసిన సీపీఐ నాయకుడు కపర్ది ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. కపర్ది 43వ వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరం పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ సెంటరులోని సీపీఐ స్థూపం వద్ద కపర్దీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం కేంద్రంగా కపర్ది రాష్ట్రస్థాయి కార్మికోద్యమాలను నిర్మించి కార్మికుల హక్కుల సాధనకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్ ప్రసాద్, బి.రాము, చిటికల రవికుమార్, చుండూరు బాలాజీ, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జైలులో ఖైదీలకు సరైన సౌకర్యాలుండాలి


ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

నరసాపురం: జైలులో ఖైదీలకు నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు సబ్‌జైలు అధికారులను ఆదేశించారు. శనివారం జడ్జి శ్రీనివాసరావు నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ముందుగా వంటశాలలను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి పరిశీలించారు. సబ్‌జైలులో టాయిలెట్స్, మంచినీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. రిమాండ్ ఖైదీల్లో ఎవరైనా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండి, బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేకపోతే ఫిర్యాదు చేయాలన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెయిల్‌పై బయటకు వెళ్లిన రిమాండ్ ఖైదీలు కోర్టు వాయిదాలకు సక్రమంగా రాకపోతే కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, న్యాయవాదులు శిరీష, చాముండేశ్వరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణతో వృద్ధులకు మెరుగైన వైద్యం


మహిళలకు చీరలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

ఆకివీడు: నిరంతర పర్యవేక్షణతోనే వృద్ధులకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు చెప్పారు. స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో గొట్టుముక్కల శ్రీరామరాజు జ్ఞాపకార్థం శనివారం చీరలు, భోజన ప్యాకెట్లను లయన్స్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులకు బీపీ, సుగర్, ఇతర ఆరోగ్య సమస్యల్ని ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సేవలందించడం హర్షదాయకమన్నారు. సంఘ గౌరవధ్యక్షులు డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పుష్కర కాలంగా వృద్ధులకు వివిధ రూపాల్లో సేవలందిస్తున్నట్లు చెప్పారు. సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడతూ వృద్ధులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ 100కు పైగా సదస్సులు నిర్వహించామన్నారు. వేలాది మందికి దుప్పట్లు, చీరలు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు దాతల సహకారంతో అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పల్లి అప్పిరెడ్డి, నేరెళ్ల ఆదినారాయణ, వీజే.కోటేశ్వరరావుబాబు, అడవి సుబ్బారావు, ఎస్.కోటేశ్వరరావు, పేర్ల ప్రసాద్, శివరామకృష్ణంరాజు, లయన్స్ అధ్యక్షుడు వీవీ.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజానాట్యమండలి వార్షికోత్సవం


భీమవరంలో మాదాల రంగారావు, కపర్ధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని తెలుగు నాట ప్రజా సాంస్కృతికోద్యమ సారధిగా ప్రజానాట్యమండలి నిలిచిందని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. ప్రజానాట్యమండలి 81వ వార్షికోత్సవం, సినీనటుడు మాదాల రంగారావు జయంతి, కార్మిక నేత ఎంవిఎస్ కపర్ది వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతె 81 ఏళ్లుగా ప్రజానాట్యమండలి ప్రజల మధ్య ఉంటూ పాటలు, బురకథ, హరికథ, నాటకాలు, నాటికలు, నృత్యప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసిందన్నారు. సినిమా రంగంలో రెడ్‌స్టార్‌గా వెలుగుందిన మాదాల రంగారావు ఎర్ర సినిమాలకు అడ్రస్‌గా ఉంటూ ఎన్నో చైతన్యవంతమైన సినిమాలు తీసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అలాగే ప్రముఖ కార్మిక నేత ఎంవీఎస్ కపర్ధి ప్రజా నాట్య మండలిపట్ల ఎంతో అభిమానంతో ఉండేవారన్నారు. ముందుగా రంగారావు, కపర్ధి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగేశ్వరరావు, ఫోకస్ సంస్థ అధ్యక్షుడు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, తిరుమాని చంటిరాజు, కామేశ్వరరావు, కాటి వెంకటరత్నం, తమరి సాంబమూర్తి, ఎం శ్రీనివాసరావు, చాన్ బాషా, జవ్వాది దాశరధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత సేవలో ఆర్‌జేసీ

పెనుగొండ: దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కేవీ సుబ్బారావు దంపతులు పెనుగొండ ప్రసిద్ధ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాన్ని దర్శించుకున్నారు. శనివారం ఆర్‌జేసీ సుబ్బారావుకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ, ట్రస్టీలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీనగరేశ్వర స్వామికి అభిషేకంలు, మహిషాసుర మర్ధనీ, వాసవీ మాతలకు పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆర్‌జేసీ దంపతులకు వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం

అఖిల భారత పెనుగొండ శ్రీ వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో బెంగుళూరుకు చెందిన భక్తులు వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం 102 రుషీ గోత్ర మందిరం వద్ద తొలుత గోపూజ నిర్వహించారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ పర్యవేక్షణలో అర్చకుడు శిష్టా మణికంఠ అభిషేకాలు నిర్వహించారు. పూజలు, అర్చనలు అనంతరం వాసవీ హోమం నిర్వహించారు. వాసవీ హోమంలో పూర్ణాహుతి సమర్పించి 102 రుషీ గోత్ర మందిరంలో వాసవీ పురాణం పఠనం చేశారు. బెంగుళూరు నుంచి 200 మందికి పైగా భక్తులు తరలిరావడంతో వాసవీ శాంతి థాం కిటకిటలాడింది.


శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ ఆలయంలో ఆర్‌జేసీ సుబ్బారావు దంపతులు


వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న బెంగుళూరు భక్తులు

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సాకోడూరుకు చెందిన మీసాల రేణుకాస్వాతి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం తరువాత దాతలకు వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కౌంటింగ్ రోజున ప్రజలంతా సహకరించాలి

వీరవాసరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని వీరవాసరం ఎస్సై పి.రమేష్ తెలిపారు. వీరవాసరం, తోలేరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి ర్యాలీలు నిర్వహించడం కానీ, బాణసంచా కాల్చకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా నలుగురు వ్యక్తులకు మించి సమూహాలుగా ఉండడం గానీ, సమావేశాలు నిర్వహించరాదన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని వివరించారు. .పౌరులంతా పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీదే విజయం


కొవ్వూరి వేణుమాధవ రెడ్డి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, అఖండ విజయం సాధించడం ఖాయమని ఏపీ విద్య మౌలిక వసతుల కల్పన కార్పోరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణు మాధవ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు విశ్వసనీయతకే పట్టం కట్టబోతున్నారని, ప్రజలకు మంచి చేసిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన కూటమి దుష్ప్రచారం, కుయుక్తులపైనే నమ్మకం పెట్టుకుందని మండిపడ్డారు.

రేపటి నుంచి దేశాలమ్మవారి జాతర

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో లాకు దిగువ చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుండి ప్రారంభంకానున్నాయి. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణలతో బారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు సోమవారం నుంచి జూన్ 2 ఆదివారం వరకూ ఏడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి పానకం కావిడి, నైవేద్యం సమర్పించిన అనంతరం జాతర ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం మజ్జి దుర్గా సత్యేంద్ర, లక్ష్మీ దంపతులచే లక్ష మల్లెల పూజ చేయనున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షులు శిడగం రామలింగేశ్వరరావు, అధ్యక్షులు వలిరెడ్డి వరహాలరావు, ప్రధాన కార్యదర్శి శిడగం చంద్రశేఖర్, కోశాధికారి వలిరెడ్డి పెద్దిరాజు, మునకాల అఖిల్ కృష్ణ సాయిరామ్, పెద్ది వీర వెంకట సత్యనారాయణ, వలిరెడ్డి ఏసుబాబు, వండాని మణికంఠ తదితరులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

యలమంచిలి: చించినాడ బస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలకు గాయాలైనట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. యలమంచిలి కొత్త కాలనీకి చెందిన కొల్లు మంగ, ఆమె చెల్లెలి కూతురు శ్రీపూజిత బస్టాండ్ వద్ద నుంచుని ఉండగా దిగమర్రు వైపు రాజోలు వైపు వెళ్తున్న పల్సర్ బండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరికీ వైద్యం చేయగా శ్రీపూజితకు సీరియస్ కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తీసుకెళ్లారు. ఈ మేరకు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు.

సార్వా పంటపై రైతులకు అవగాహన

మొగల్తూరు: సార్వా పంటకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదేశించారు. మండలంలోని కొత్తోట రైతు భరోసా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్‌బీకే సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. దాళ్వా మాసూళ్లు పూర్తయిన చేలల్లో భూసార పరీక్షలు నిర్వహించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. నాట్లు వేసిన వెంటనే ఈక్రాప్ నమోదు చేయాలని, ఈ క్రాప్ వలన కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించాలని సూచించారు.

నేడు దండు గంగాలమ్మ అమ్మవారి జాతర

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉన్న శ్రీ దండు గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, పెన్నాడ ఎఫ్‌సీఐ సభ్యులు, సివిల్ సప్లై జట్టు సభ్యులు, ధర్మకర్త గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం అమ్మవారి దర్శనం, చలివిడి పానకాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం సాయంత్రం జాతర మహోత్సవం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద తోట సీతయ్య కుమారుల సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని వివరించారు.

వేలం పాట రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని గునుపూడిలో ఉన్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానానికి చెందిన య.87-71సెంట్లు వ్యవసాయ భూమి కి 2024-2025 నుంచి 2026-2027 వరకు టెండర్-కమ్-బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాటదార్లు ఆసక్తి చూపని కారణంగా వేలం పాట నిలుపుదల చేశారు. ఈ బహిరంగ వేలం పాటలను దేవదాయ శాఖ తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వర రావు నిర్వహించారు.

పీవీఎల్ పరామర్శ


కలవపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న పీవీఎల్

కాళ్ల: మండలంలోని కలవపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు శనివారం పరామర్శించారు. గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకుడు బొండు రాజు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు పీవీఎల్ నరసింహరాజు ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు.

29న సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ నెల 29న మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.